# తోడు

- మీనాక్షి శ్రీనివాస్



ఏమండీ... ఏమండోయ్... విసురుగా పిలుస్తూ గదిలోకి వచ్చిన లలితకు కోపం నషాళాని కెక్కింది... భర్త హాయిగా పడుకుని పేపరు చదువుకోవడం చూసి.

ఛ... మిమ్మల్నీ.... అవతల కొంప అంటుకు పోతుంటే హాయిగా పేపర్ చదువుకుంటున్నారు... పేపరు... అంటూ విసురుగా పేపరు లాగి అవతల పడేసింది.

అబ్బా...ఏమిటి లల్లీ... సెలవు పూట కాసేపు ప్రశాంతంగా పేపరు చదువుకోనియ్యవు.... కొంప అంటుకుంటే చెప్పాల్సింది ఫైర్ ఆఫీసువాళ్ళకి, ఫోను చేస్తే వాళ్ళొస్తారు... అంతేకానీ నన్నెందుకిలా వేధిస్తావు పొద్దున్నే. అంతే లెండి... నే మాట్లాడితేనే మీకు వేధించడం... అసలు ముద్దు మురిపెం తెల్సిన మొగుడు అని నా గోడు మీకు చెప్పుకోవాలనుకోవడం... నా ఖర్మ కొద్దీ దొరికారు...

అమ్మ... వద్దు తల్లీ. పంచాంగ శ్రవణం వద్దు కానీ... దా... యిలా కూర్చో.. యిప్పుడు చెప్పు నీ కొచ్చిన కష్టం ఏమిటి?పొద్దున్నే నీ విషాద యోగానికి కారణం ఏమిటి... గోరింటాకుతో ఎర్రగా పండిన ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుంటూ అడిగాడు...

మీ నాన్న గారు తన పెన్షన్ బెనిఫిట్స్ అవీ 'ఆవిడ' గారి పేర వ్రాసేస్తున్నారు... ఆవిడ అన్న పదం పలకడంతోనే అంతా అర్థం అయిపోయింది శ్రీహరికి

ఛ.... ఎవరు చెప్పారు నీకు... నాన్న అలా ఎందుకు చేస్తారు.... ఆమె చేతి వేళ్ళతో ఆడుకుంటూ అడిగాడు.

ఆ.... కనకమాలక్ష్మి అమ్మవారు కల్లోకొచ్చి చెప్పింది... వెటకారంగా అంది.

అవునా... అయితే తప్పకుండా అలా చెయ్యాల్సిందే.. పైగా మా యిలవేల్పు కూడాను 'ఆవిడ'... నవ్వుతూ అంటున్న భర్తని చూసి అరికాలి మంట నెత్తికెక్కింది లలితకు. మీ కన్నీ వేళాకోళమే... ఛ...ఛ...ఎంత అప్రతిష్ఠ ఎంత అవమానం... నలుగురిలో తలెత్తుకు తిరగగలమా

అలాంటి పనిచేస్తే. యింకా విసురుగా ఏదో అనబోతున్న లలితను వారిస్తూ....

చూడు లలితా...ఏది మంచో, ఏది చెడో మా నాన్నగారికి బాగా తెలుసు. ఒకరిచేత చెప్పించుకునేలాగా...ఒకరు వేలెత్తి చూపేలాగా ఆయన ప్రవర్తించరు...ఎవరో ఏదో చెబితే దాన్ని నమ్మి... నీ మనసు పాడు చేసుకోకు... నా మూడ్ పాడు చెయ్యకు. లాలనగానే చెప్పినా ఆ స్వరం ఖచ్చితంగా ఉంది.

అంటే ఏమిటీ... ఈ యింట్లో ఏం జరుగుతున్నా... ఎవరు ఏం చేస్తున్నా అలా నోరు మూసుకు చూస్తూ ఊరుకోవాలా... తీవ్రంగా అడిగింది లలిత. చూడు లలితా.. ఈ యింటికి నువ్వు నిన్న కాక మొన్న వచ్చావు.. అంత మాత్రాన నీకు ఈ ఇంటి వాళ్ళతోనూ.... యింటి విషయాలతోనూ జోక్యం లేదనే మూర్ఖుడిని కాదు నేను.. అయినా నేను గమనిస్తూనే ఉన్నాను... ఈ మధ్య కాలంలో ఈ యింట్లో వస్తున్న మార్పులను... అవి ఏ రకం మార్పులయినా వాటికి బాధ్యురాలవు మాత్రం ఖచ్చితంగా నువ్వే... నేనా... మధ్య నేనేం జేశాను... ఆ ముసలాయనని ఆవిడతో సంబంధం పెట్టుకుని అన్నీ ధారాదత్తం చెయ్యమని నే చెప్పానా.. లలితా...నా సహనాన్ని పరీక్షించకు... నువ్వు యింకొక మాట మాట్లాడినా ఆ తరువాత జరిగే దానికి నే బాధ్యుడిని కాను... మాట నెమ్మదిగానే ఉన్నా చాలా పదునుగా ఉంది... ఎంత కోపాన్ని ఆపుకుంటున్నాడో కళ్ళలో ఎర్రజీరే చెబుతోంది.

సరే...ఎంతయినా ఎన్ని చేసినా ఈ యింటి కోడలిగా... నా యిల్లాలిగా నీకు స్థానం ఉంది కనుక చెబుతున్నా విను...

అన్నపూర్ణమ్మగారు అవడానికి వంట మనిషే అయినా... ఆ విషయం మా కెవరికీ గుర్తు రానంతగా మా యింట్లో మనిషిగా కల్సిపోయారు. నీకు తెలుసా- మా అమ్మ పోయేనాటికి నాకు ఆరేళ్ళు... మా చెల్లికి నాల్గేళ్ళు అసలు అమ్మ ఎలా వుంటుందో ఫోటో తప్ప మా ఊహలోకూడా తెలీదు. ఆ డిప్రెషన్ లో ఫస్టయిమ్ ఒళ్ళు తెలియకుండా తాగి రోడ్డు మీద పడిపోయిన మా నాన్న గారిని ప్రమాదం నుండి కాపాడి యిల్లు చేర్చారు ఆవిడ. జరిగిపోయిన దానిని గుర్తు చేసుకుంటూ బాధ్యత లేకుండా ప్రవర్తిస్తే చిన్న పిల్లలు అనాధలయిపోతారనీ.. వాళ్ళను పెంచి పెద్దచేసే బాధ్యత కన్నందుకు మీకుందనీ ఎంతగానో నచ్చచెప్పిందట. ప్రేమ....యమపాశమై... ప్రేమించినవాడు కాలయముడై తననీ తన అందాన్ని అమ్మి సొమ్ము జేసుకుందామని చూస్తుంటే ఎలాగో తప్పించుకుని పారిపోయి వచ్చాననీ... ఏ గమ్యంలేని తన జీవితం కంటే విషాదకరమైనదికాదు మీ పరిస్థితి అనీ, పిల్లల్లో వాళ్ళ తల్లిని చూసుకుంటూ మీ బాధ్యతలని నెరవేర్చు కొమ్మని చెప్పిన ఆమె సంస్కారం, ఆలోచన శక్తి... నాన్నకు ఎంతగానో ఉపయోగించాయి.

ఏ బంధం లేకుండానే ఆమె మా యింటి కంకితం అయిపోయింది...

మా ఆలన పాలన చూసింది. ఎన్నో మార్లు.. ఎందరో ఆమెని పెళ్ళి చేసుకోమని మా నాన్నకి సలహాలివ్వడం నేను స్వయంగా విన్నాను. అన్నింటికీ చిరునవ్వే సమాధానం అయింది. అటువంటి పవిత్రమూర్తి ఈ రోజు ఆమెకో స్థానం, హక్కు ఈ యింట్లో కల్పించాలనుకుంటున్నారంటే దానికి కారణం ఏమిటి? ఎవరు... యిప్పుడు ఆమె ఉనికికే, ఆమె భవిష్యత్ గడవడానికే ముప్పు వచ్చే పరిస్థితి మన యింట్లో కనబడుతోంది.. అందుకే ఆయన అలాంటి నిర్ణయం తీసుకోవల్సి వచ్చింది....

అది కాదండీ... ఏదో చెప్పబోయింది లలిత...

నన్ను చెప్పనీ లలితా... నే గమనిస్తూనే ఉన్నాను.నువ్వు ఈ యింటికి వచ్చినప్పటినుండీ... నువ్వు ఆవిడతో మెలిగే తీరు.....

ఆప్యాయంగా 'హరీ' అనీ 'చినబాబు' అని పిలిచే ఆమె పిలుపుకు నేను దూరం అయిపోయాను. అమ్మాయ్ లలితా అని నిన్ను పిలిచిన ఆమెను నువ్వు నిలదీసి... నన్ను చిన్నబాబుగారనీ.. నిన్ను 'అమ్మగారనీ' పిలవాలని ఆదేశించినప్పటి నుండే నాలో తపన... సంఘర్షణ మొదలయింది....

అమ్మలా ప్రేమనీ.. ఆదరణనీ పంచి మమ్మల్ని పెంచిన అన్నపూర్ణమ్మ గారితో ఈ యింటికున్న అనుబంధం బీటలు వారబోతోందని...అందుకే అతి కష్టం మీద నాన్నగారికి నచ్చచెప్పి...

ఒప్పించా...

పక్కలో బాంబు పడ్డట్టు అదిరిపడింది లలిత....

మీరు...మీరిచ్చారా ఆ సలహా....

అవును... ఏది ఉన్నా లేకపోయినా ప్రతి మనిషికీ బతికినంతకాలం కావల్సినది తిండీ, బట్టా... నిలువనీడా.. అన్నపూర్ణమ్మగారికి జీవిత చరమాంకంలో వాటికి లోటుండకూడదు. అనే ఉద్దేశ్యంతో...ఆమెను ఎటూ ఆదుకోలేనని తెల్సిన నా అసహాయతకు యిలా మా నాన్న సహాయాన్ని అర్థించా...

ఒక్క విషయం చెప్పనా.... నువ్వు అనుకుంటున్నట్లా.... చాటు మాటుగా అన్నట్లు...మా నాన్నే ఆమెను కోరుకుంటే....ఆమె ఏరోజో మానాన్నకి, ఈ యింటికి యిల్లాలు అయ్యేది... మహారాణీ అయ్యేది..కాని... ఆమెకి కావాల్సింది... కాస్తంత తోడు... నీడా...తోడేలు లాంటి ఈ సమాజం నుంచి రక్షణ... ఆ రక్షణ కోసం.. పట్టెడన్నం తిన్న విశ్వాసానికే.... మా యింటి బాగుకే.. మా బాగుకే తన శక్తినంతా ధారబోసింది... మేం నవ్వితే నవ్వింది... మేం ఏడిస్తే ఏడ్చింది... అలాంటి అనుబంధం అర్థం కావాలంటే మనసుండాలి.... అందుకే ఏ రోజు ఎలా ఉన్నా ఆమెకు ఏదీ చెయ్యలేని నేను ఆమె చివరి రోజులు ఏ యిబ్బందీ... కష్టం లేకుండా సాఫీగా జరగాలనే ఆలోచనతోనే నేనే... మానాన్నకు ఆ సలహా యిచ్చాను. నీకు అనవసరమైన భేషజాలే కానీ ఏ విషయాన్నయినా మనసు పెట్టి చూసే అలవాటు లేదనీ యింక రాదనీ గ్రహించాను.. కన్న తల్లితండ్రులే బరువై... అనాథల్లా అలమటిస్తున్న ప్రస్తుత సమాజంలో నాన్నగారి తర్వాత ఆమెను ఆదరించలేననీ... ఏ విధంగాను ఆమెను ఆదుకోలేననీ అర్థం అయ్యాకే ఈ ఆలోచన చేశాను.... ఆమెను మనతోనే ఉంచుకుంటానంటే 'గతిలేక' తప్పక నువ్వు ఒప్పుకోవచ్చు.. కానీ నిత్యం సంఘర్షణలతో అందరం సతమతమయిపోతాం... పైగా కడుపులో లేనిది కౌగిలించుకుంటే వస్తుందా అన్నట్లు...నీకు మనసులో ఆవిడమీద ప్రేమ.. ఆప్యాయత లేకపోతే మానె, కనీసం జాలి దయ అయినా లేనప్పుడు కలిసి వుండడం అంత నరకం యింకోటి లేదు.

అయితే మాత్రం.... ఏదో అనబోయింది లత

చూడు, ఈ విషయంలో యింక తర్జన భర్జన లనవసరం... నేను హైదరాబాదు ట్రాన్స్‌ఫర్‌కు అప్లయి చేశాను... పిల్లల చదువుల దృష్ట్యా అవసరం అని... రేపో... మాపో వస్తుంది.. మనం వెళ్ళిపోతాం... వాళ్ళిద్దరూ ఒకళ్ళకొకళ్ళు తోడు....నీడా.. వాళ్ళ బతుకులు వాళ్ళని బతకనీయ్. మనసు తెలిసి మసలుకునే తోడు ఎంతటి ఆనందాన్ని యిస్తుందో అనడానికి ఉదాహరణ మహాకవి శ్రీశ్రీగారు వ్రాసిన 'మనసున మనసై బతుకున బతుకై తోడొకరుండిన అదే భాగ్యము.. అదే స్వర్గము..' అన్న పాటే...

వాళ్ళది అనైతికము, అసహజము అయిన నీచ సంబంధం కాదు లల్లీ... మనసెరిగి మసలే.. మానసికమైన తోడు.. అది ఎంతైనా ఉన్నతమైనది. తెలిసీ తెలియక మాట్లాడితే చులకనయ్యేది, అలా మాట్లాడిన వాళ్ళే. ఇంక వెళ్ళి నీ పని చూసుకో! ప్రశాంతంగా పేపరు చదువుకోవడంలో మునిగి పోయాడు శ్రీహరి.

❑

---

# శివరాత్రి దర్శనం

బాల్యం మాలిన్యం అంటని దశ
ఆ దశలో
గుడి దిశగా
ఆగని పరుగు
ఆకలి ధ్యాస మరిచి
ఆలోచనల నిండా శివుని ముద్రిస్తూ
నడకే నడక
ఎక్కడి కాసా గార్డెన్స్?
ఎక్కడ సువర్ణముఖీ నది?
మూడు మైళ్లు మూడు క్షణాలులా
ముప్పై నిముషాలలో
ముచ్చటగా ముచ్చట్లతో చేరితే
మళ్లీ మళ్లీ చూడాలనిపించే
శ్రీకాళహస్తీశ్వర దర్శనం
మనసంతా హాయిని నింపే సందర్శనం.

**- యలమర్తి అనూరాధ.**